

మరో అడుగు

– డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఆ రాత్రి అందరూ అన్యమనస్కంగా, కలత నిద్రతోనే గడిపారు.

మర్నాడు ఉదయమే దొడ్డమ్మ రోహిణి ని తీసుకుని రావడానికి యష్ ఎయిర్పోర్ట్ కి వెళ్ళాడు.

యామిని కూడా ఉదయమే నిద్ర లేచి అమ్మతో కాస్త సమయం గడపడానికి వంటింట్లో చేరింది.

కేశవరావు డాక్టర్ షాతో ఫోన్ లో మాట్లాడడం మొదలు పెట్టారు.

ఆ రిపోర్ట్ తీసుకుని వచ్చినప్పటినించీ ఆయన మనసు మనసులో లేదు. వీలైనంత త్వరగా డాక్టర్ షాతో మాట్లాడి తన అనుమానాలని తీర్చుకోవాలని ఆయన తపన.

" మీరన్నది నిజమే! ఇంత లేట్ స్టేజ్ వరకూ ఎవరికీ ఏ విషయమూ తెలియకపోవడం చాలా ఆశ్చర్యమే. అయినా చాలా రకాల లంగ్ కాన్సర్లు ఎంతోకాలం పాటు బయటపడకుండా ఉండడం చాలా సాధారణమే. చాలా క్రమశిక్షణతో జీవితాన్ని గడిపే ఆవిడకి రావడం చాలా ఆశ్చర్యమే కాదు విచారకరం కూడా యశోదగారికి మనం చాలా క్రమబద్ధమైన చికిత్సని అందిద్దాం. దానివల్ల మనం ఏదీ వదిలేయకుండా కూలంకషంగా సమస్యని ఎదుర్కోవడానికి వీలుంటుంది. మీరు నా దగ్గరకి వచ్చినప్పుడు అన్ని విషయాలు వివరంగా చెప్తాను. నాకు బాగా తెలిసిన డా.జైన్ మన నగరంలోనే ప్రముఖ కాన్సర్ వ్యాధి నిపుణుడు. వెంటనే ఆయనతో మాట్లాడతాను. ఆయన చేతుల్లో మనం యశోదగారిని పెడితే మనకి చాలా భరోసాగా ఉంటుంది. కాకపోతే ఆయన గురించి మీకోసంగతి చెప్పాలి. ఆయనదంతా ముక్కుసూటి వ్యవహారం. పెద్దగా నైసిటీస్ ని పట్టించుకోడు. మా డాక్టర్లందరిదీ తలో పద్ధతి. ఆయన వ్యవహారం ఎప్పుడూ డైరెక్ట్ అన్నమాట. ఏ విషయమైనా సూటిగా చెప్పేస్తాడు, దానివల్ల ఆయన్ని చాలామంది తప్పుగా అనుకుంటారు. కానీ ఆయన ఉద్దేశ్యం వేరు.

‘ డాక్టర్ గా మనం చెప్పాల్సిండి చెప్పక పోతే చికిత్స ఎలా జరుగుతుంది? వాళ్ళకెలా తగ్గుతుంది ?’ అంటారు. మసి పూసి మారేడుకాయ చేస్తేనూ, పంచదార కోటింగ్ వేసి చేదు మాత్రలని ఇస్తేనూ పనులు జరగవు కదా అంటారు. బట్ బిలీవ్ మీ. హీ ఈస్ ద బెస్ట్. అన్నారు. మరొక విషయం..మనోధైర్యాన్ని మించిన మందులేదు. మీరంతా ఆమెకి వీలున్నంత ధైర్యం చెప్తూ, దిగులుపడకుండా ఉండేలా చూడండి. ప్రస్తుతానికి ఇంతకన్నా ఏమీ చెయ్యలేం! లెట్ అజ్ హోప్ ఫర్ ద బెస్ట్" అన్నారు డాక్టర్ షా ఫోన్ కాల్ ముగిస్తూ.

కేశవరావు పిల్లలిద్దరికీ ఆ విషయాలు చెప్పారు.

" ఆయన చెప్పింది నిజమే నాన్నా! డాక్టర్ జైన్ చాలా పేరున్న ఆంకాలజిస్ట్" అంది యామిని వెంటనే.

" దట్స్ గుడ్ టు హియర్ తల్లీ!" అన్నారు కేశవ్.

యామిని, యష్ కూడా నెమ్మదిగా తమకు కలిగిన షాక్ నించి తేరుకోవడానికి ప్రయత్నిస్తూనే, లంగ్ కేన్సర్ల గురించీ, ఇప్పుడు వస్తున్న అధునాతనమైన చికిత్సామార్గాల గురించీ చాలా సేపు మాట్లాడుకున్నారు.

ఎందుకు జరిగింది అని కాక, ఇప్పుడు ఏం చేస్తే బావుంటుంది? ఎలా చెయ్యాలి అన్న విషయాల మీదే వారి ప్రస్తుత ఫోకస్ అయింది.

మర్నాడు ఉదయం యష్ ఎయిర్పోర్ట్ కి వెళ్ళి తమ దొడ్డమ్మ రోహిణి ని తీసుకు వచ్చాడు. పొద్దున్నే కరుణ బ్రేక్ ఫాస్ట్ కి టేబుల్ సిద్ధం చేస్తుండగా వచ్చారు వాళ్ళిద్దరూ.

అక్కని చూసిన యశోద చిన్నపిల్లలా పరిగెత్తుకుని వెళ్ళి కౌగలించుకుంది. ఆవిడ కూడా చెల్లెల్ని దగ్గరగా హత్తుకుని వెన్ను నిమురుతూ ఉండిపోయింది కొన్ని క్షణాలు.

ఇద్దరూ కూడా మాట్లాడలేదు కాసేపు.

" నాన్న, యామీ, దొడ్డ వచ్చారు" అన్నాడు యష్ రెండు నిమిషాల తర్వాత.

" వదినా, బావున్నారా?” అంటూ కేశవరావు గారూ, “దొడ్డమ్మా!” అంటూ చిన్నగా హత్తుకున్న యామినీలని చూసి నవ్వింది ఆవిడ.

ఏం మాట్లాడాలో తెలియలేదు ఆ గదిలో ఉన్నవారెవ్వరికీ. అందుకే మౌనం.

" దా దా, టిఫిన్ చేద్దాం, కరుణా, అమ్మ సామాన్లు మా రూం కి దగ్గరగా ఉన్న గెస్ట్ రూం లో పెట్టు. నాకు దగ్గరగా ఉంటే రాత్రి కబుర్లు చెప్పుకోవడానికి వీలుగా ఉంటుంది" అంది యశోద చిరునవ్వుతో.

రోహిణి కూడా ప్రేమగా చెల్లెలి ముంగురులు సవరించి మృదువుగా చూసింది యశోద వైపు.

" రా దొడ్డమ్మా! ముఖం కడుక్కుని ఫ్రెష్ అయి వస్తే బావుంటుంది కదా" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని లోపలకి తీసుకువెళ్ళింది యామిని.

" కరక్ట్! త్వరగా రండి, టిఫిన్ చల్లారిపోతుంది లేకపోతే. కరుణమ్మా! పెద్దమ్మకి కాఫీ. నీకు తెలుసుగా ఎలా కలపాలో?" అంటూ హడావిడి పడటం మొదలుపెట్టింది యశోద.

" వచ్చింది మీ అక్కే గా యశూ! ఎవరో కొత్తవాళ్ళొచ్చినట్టు హడావుడి పడతావేం?" చిరునవ్వుతో అంటూ వచ్చి టేబిల్ దగ్గర కూర్చున్నారు కేశవ.

నవ్వింది యశోద.

అందరూ టేబిల్ దగ్గర చుట్టూ చేరి కరుణ వడ్డిస్తూ ఉంటే వేడిగా టిఫిన్ చేశారు. తర్వాత ఒక్కొక్కరుగా అందరూ తమ పనుల మీద బయటకు వెళ్ళారు.

" కరుణా, మీరందరూ కూడా టిఫిన్ తినేయండి. నేను, పెద్దమ్మ గార్డెన్ లో కూర్చుంటాం కాసేపు" అంది యశోద అక్క చెయ్యి పట్టుకుని తోటలోకి నడుస్తూ.

ఇద్దరూ గార్డెన్లో ఉన్న సిమెంట్ బెంచ్ మీద కూర్చున్నాకా అప్పటివరకూ ఉగ్గబట్టుకున్న బాధ గుండెలోంచి, గొంతులోకి వచ్చి కంటినిండుగా పొంగుకొచ్చి చిన్నపిల్లలా అక్కని పట్టుకుని ఏడవడం మొదలు పెట్టింది యశోద.

రోహిణి కళ్ళల్లోనూ అప్రయత్నంగా నీరు తిరిగి చెల్లెల్ని బలంగా హత్తుకుంది.

కొద్దిసేపు ఇద్దరూ అలాగే ఉండిపోయారు.

నెమ్మదిగా తేరుకున్న యశోద " నేను ఎక్కువ బాధ పడుతూ కనిపిస్తే, కేశవ, పిల్లలూ మరింత దిగులు పడిపోతారని అతి కష్టమ్మీద నిభాయించుకుంటున్నాను కానీ ఏం చెయ్యాలో తెలియడమే లేదక్కా! ' ఎందుకు ఇలా జరుగుతోంది? నాకే ఎందుకు? లాంటి ప్రశ్నలదగ్గరినించీ ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు నన్నెంత తినేస్తున్నాయో చెప్పలేను. ఒకసారి నాకేమీ కాదు, తగ్గిపోతుంది అనిపిస్తుంది, మరోసారి చెప్పలేనంత దిగులు వేస్తుంది. ఇదంతా ఎక్కడికి

వెళుతుందో అనిపిస్తోంది. నువ్వు వెంటనే రావడం నాకెంత ధైర్యానిచ్చిందో నీకు తెలీదు. థాంక్ యూ అక్కా!" అంది చాలా ఉద్విగ్నంగా.

" పిచ్చిదానా, నీకూ నాకూ మధ్యన థాంక్ యూ లేమిటి? అసలు మనిద్దరం ఈ కన్నీళ్ళు పెట్టుకోవడమేమిటి? అసలు నీకేమయిందని? ఏమీ కాదు. తొందరలోనే తగ్గి హాయిగా ఉంటావు చూడు. ఎప్పుడూ నవ్వుతూ ప్రశాంతంగా తిరిగే నువ్వు ఇలా దిగులుగా ఉండడం ఏమిటి?" అంది వాతావరణాన్ని తేలిక పరచడానికి ప్రయత్నిస్తూ.

అక్క చేస్తున్న ప్రయత్నాన్ని చూస్తున్న యశోద ముఖాన చిరునవ్వు వచ్చి చేరింది.

" గుడ్! అలా నవ్వుతూ ఉండు, ఏ అనారోగ్యమైనా నీ ధాటికి తట్టుకోలేక పారిపోతుంది చూడు. ఇంకేమైనా కబుర్లు చెప్పు. నీ ఇంటీరియర్ ప్రాజెక్ట్ ల గురించి చెప్పు. రాజీవ్ కూతురు యుక్త 'యశూ నానీ' (నాన్నమ్మ) దగ్గరకి నేనూ వస్తాన ని ఒకటే గొడవ. స్కూల్ శలవలిచ్చాక వెళదాం, అప్పుడు రొనీ నానీ ని (రోహిణి నాన్నమ్మ) తీసుకుని వచ్చేద్దాం అని చెప్పడానికి వాడి తల ప్రాణం తోకకొచ్చిందనుకో" అంటూ నవ్వింది.

"యామీ పెళ్ళి గురించి ఏమంటోంది? కుదిరితే ఇద్దరికీ ఒకేసారి చేసేస్తే బావుంటుంది కదూ!"

ఇలాంటి కబుర్లు చెప్తూ చెల్లెలి దృష్టి మళ్ళించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది రోహిణి.

నెమ్మదిగా ఇద్దరూ మామూలు కబుర్లలో పడ్డారు.

బాగా పైకొచ్చిన ఎండ ముఖాన్ని మాడ్చడం మొదలు పెట్టేవరకూ ఎంతసేపున్నారో తెలీలేదు ఇద్దరికీ

అంతలో, ఇద్దరికీ పల్చటి మజ్జిగ తేట గ్లాసుల్లో పోసుకుని తీసుకుని వచ్చింది కరుణ.

" అమ్మా! మజ్జిగ" అంటూ ఇద్దరికీ చెరో గ్లాస్ ఇచ్చి " వంటకేం చెయ్యమంటారు? అని రత్న అడుగుతోంది. మీరిద్దరూ మాట్లాడుకుంటున్నారు, డిస్టర్బ్ చెయ్యడమెందుకు? అని ఆగాము. మీరు చెప్తే చేసేస్తుంది. పెద్దమ్మా మీరేం తింటారు? చెప్పండి" అంది నవ్వుతూ.

" ఈ పూట, రాత్రి కూడా పెద్దమ్మ కి ఇష్టమైనవే!. నన్నేమీ అడక్కు" అంది యశోద నవ్వుతూ కాళ్ళు పైకి మడత పెట్టుకుంటూ.

"ఏదైనా సింపుల్ గా చెయ్యమను కరుణమ్మా ఈ పూటకి. రాత్రికి చూద్దాం." అంది రోహిణి.

మూడురోజుల తర్వాత దొరికింది డాక్టర్ జైన్ తో మొదటి అపాయింట్ మెంట్.

చాఅ మాములుగా, ఒక రకమైన మూసలో పోసినట్టుగా జరిగింది ఆయనతో వ్యవహారం.

డాక్టర్ షా చెప్పినట్టుగానే చాలా కోల్డ్ గా, తన పేషెంట్లతో పెద్దగా అనుబంధాన్ని పెంచుకోవటానికి ఇష్టం లేని వ్యక్తిలా అనిపించారు జైన్.

రిపోర్ట్ చూసి 'పాథాలజీ టెస్ట్ చేయించాలీ' అన్న చోట చేతిలోని పెన్నుతో పాయింట్ చేస్తూ చెప్పాడు.

" ఇక్కడ చెప్పినట్టు లంగ్ బయాప్సీ చేయించాలి, ఏ రకమైన లంగ్ కేన్సరో తెలియాలి కదా. అది చూశాకా ప్రత్యేకమైన మాలిక్యులర్ టెస్ట్ లు చేయించాలి, ఏరకమైన ప్రత్యేకమైన మందులు వాడాలో అప్పుడు చెప్తాను. మొదట బయాప్సీ చేయించండి " అన్నాడు..

" తప్పకుండా డాక్టర్. ఈ రిపోర్ట్లని బట్టి మీ అభిప్రాయం ఏమిటి?" అన్నారు కేశవ.

ఒక్క క్షణం తల ఎత్తి కేశవరావు వైపు చూశాడు డాక్టర్.

"చ్చ్! చాలా కష్టం. ఇంత స్ప్రెడ్ అయిన తర్వాత నిజం చెప్పాలంటే నయమయ్యే అవకాశాలు చాలా తక్కువే.. దాదాపు నిల్. నన్ను అడిగితే పాలియేటివ్ కేర్ లో పెట్టడం మంచిది. ఉపశమనంగా ఉంటుంది. మీరేమీ ట్రీట్ మెంట్ చేయించుకోకుండా ఇలాగే ఉంటే ఓ ఆరునెలలు, చేయించుకుంటే మరికాస్త కాలం పొడిగించవచ్చు."

ఏదో చాలా మాములు విషయం చెప్తున్న వాడిలా సూటిగా, ఏభావమూ లేని ముఖం తో చెప్పాడు ఆయన.

ఒక డాక్టర్ అంత డైరెక్ట్ గా చెప్పగలరని ఊహించలేదు కేశవరావు గారు, అది కూడా పేషెంట్ ఎదురుగా. యశోద సంగతి అసలే చెప్పక్కర్లేదు.

డాక్టర్ జైన్ చెప్పిన ఆ మాటలని విని పెద్ద షాక్ తగిలినట్టుగా ఉండిపోయారు వాళ్ళిద్దరూ.

ఏసీ చేస్తున్న శబ్దం తప్ప మరేమీ లేని నిశ్శబ్దం ఆగదిలో.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments